క్లుప్తంగా

జోగుళాంబ సన్నిధిలో అడిషనల్ కలెక్టర్



జోగుళాంబ శక్తిపీఠం: జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయాన్ని శనివారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు సాదర స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో వారు ప్రత్యేక పూజలు చేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

గద్వాల అర్బన్: రక్తదానం చేస్తే ఆపదలో ఉన్న వారికి రక్షించడంతో పాటు ప్రాణాలను కాపాడవచ్చని మెడికల్ ఆఫీసర్ నవీన్ క్రాంతి అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలో ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు వినయ్ ఉన్నారు.

ఆలయాల్లో పూజలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రధాన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంతో పాటు పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయం, అల్వలపాడు, తెలుగోనిపల్లి ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు దాసంగాలు పెట్టారు.

ఎండిపోయిన మొక్కలు



మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో హరితహారంలో భాగంగా మొక్కలను నాటారు. మండలంలోని చాలా గ్రామాలలో నీటి సదుపాయం లేక మొక్కలు ఎండిపోతున్నాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

రాజోళి: మండలంలోని తుమ్మిళ్లకు చెందిన ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపారు. మండలంలోని తుమ్మిళ్లలో గల తుంగభద్ర నది నుంచి ఇసుక రవాణా జరుగుతుందని సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించగా తుమ్మిళ్ల నుంచి ఇసుక లోడ్ తో వెళ్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని విచారించగా.. వారి వద్ద ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంబేద్కర్ జయంతికి ఏర్పాట్లు



ధరూరు: బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మండల కేంద్రంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విగ్రహానికి రంగులు వేసి అలంకరించారు. విగ్రహ ప్రాంగణంలో పంచాయతీ సిబ్బంది శుభ్రం చేశారు. ఆదివారం ఉదయం జరిగే జయంతి వేడుకలకు పలువురు ప్రత్యేక ఆహ్వానితులు రానున్నారు.

నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని కారుపాకులలో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం నూతన విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు గ్రామ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు శనివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే విజయుడు హాజరవుతారని, వివిధ సంఘాల నాయకులతో పాటు అంబేద్కర్‌వాదులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

అడుగంటిన భూగర్భ జలాలు

- సక్రమంగా సరఫరా కాని మిషన్ భగీరథ నీరు
- వట్టిపోతున్న బోర్లు, బావులు
- బిందెడు నీటి కోసం గంటల తరబడి నిరీక్షణ
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



వల్లూరులో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ ట్యాంకు





వృథాగా ఉన్న మినీ నీటి ట్యాంకు

ఎర్రవల్లిచౌరస్తా: రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతుండటంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. దీనివల్ల బోర్లు, బావులు, చేతిపంపుల్లో జలాలు లోపలికి ఇంకిపోతున్నాయి. వేసవి ప్రారంభంలోనే మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతూ అల్లాడుతున్నారు. పలు గ్రామాల్లో అరకొరగా ఉన్న చేతి పంపులు, బోరుబావుల వద్ద ఉదయం, సాయంత్రం ప్రజలు బారులు తీరాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం కోట్లు ఖర్చు చేసి మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికి నల్లా కలెక్షన్ ఇచ్చినా వాటి ద్వారా నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. దీనికి తోడు గ్రామంలో ఉన్న బావులు కూడా ఎండి పోవడంతో బోరుబావులు సైతం వట్టిపోయాయి. అరకొరగా ఉన్న చేతిపంపులతో బిక్కుబిక్కుమంటూ ప్రజలు తాగునీటి దప్పికను తీర్చుకుంటున్నారు.

వచ్చేనెల నుంచి ఎడారిగా మారనున్న వల్లూరు..

జూరాల ప్రాజెక్టులో రోజురోజుకు నీటి నిల్వలు తగ్గిపోవడంతో వచ్చే నెల మొదటి నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరాను నిలిపేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీనివల్ల మండలంలోని వల్లూరు గ్రామ పంచాయతీ ఎడారిని తలపిస్తుందేమోనని ప్రజలు ముందుగానే భయపడుతున్నారు. గ్రామంలో దాదాపుగా 700 నివాసాలుండగా, అందులో 4100 వరకు జనాభా ఉంది. గ్రామంలో 90వేల సామర్థ్యం గల రెండు మిషన్ భగీరథ నీటి ట్యాంకులతో పాటు 3 మినీ నీటి ట్యాంకులు ఉన్నాయి. ప్రస్తుతం ఒక ట్యాంకు ద్వారానే నీటి సరఫరా జరుగుతుందని మరో ట్యాంకు ద్వారా అరకొరగా నీటి సరఫరా అవుతుందని ప్రజలు పేర్కొన్నారు. కానీ గతంలో ఏర్పాటు చేసిన మూడు మినీ ట్యాంకులు మాత్రం వృథాగా ఉన్నాయి. ప్రస్తుతం గ్రామంలో కేవలం రెండు బోర్లు మాత్రమే పనిచేస్తున్నాయి. నీటి ఎద్దడిని తీర్చేందుకు అధికారులు ఇటీవల స్థానిక వాగులో నీటి శలిమలు తీసినా నీరు ఉప్పుగా ఉండటంతో తాగేందుకు పనికి రావడం లేదు. వచ్చే నెల ప్రారంభం నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరా ఆగిపోతే నీటికోసం అలమటించాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని తాగునీటి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మండలంలో పరిస్థితి..

ఉమ్మడి ఇటిక్యాల మండలంలో 29 గ్రామ పంచాయతీలతో పాటు ఆరు ఆమ్లెట్ పల్లెలున్నాయి. దాదాపు 12 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని ప్రజలు చెబుతున్నారు. మండలంలోని వల్లూరు, ఎర్రవల్లి, ఇటిక్యాల, తిమ్మాపురం, ఆర్ గార్లపాడు, బీ వీరాపురం, బీచుపల్లి, ధర్మవరం, కొండేరు, షాబాద్, ఉదండాపురం, సాతర్ల తదితర గ్రామాల్లో తీవ్రంగా నీటి ఎద్దడి ఉంది. ఆయా గ్రామాల్లో భూగర్భ జలాలు కనిష్ట మట్టానికి పడిపోవడంతో ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి ట్యాంకులను ఏర్పాటు చేసినా రెండు మూడు రోజులకు ఒకసారి నీటి సరఫరా జరుగుతుండటంతో ప్రజలకు కష్టాలు తప్పడంలేదు. మరికొన్ని గ్రామాల్లో నల్లా ద్వారా కేవలం రెండు లేదా మూడు బిందెల కంటే ఎక్కువగా నీటి సరఫరా కావడంతో తాగునీటి సమస్య అధికంగా ఉంది. మండలంలో తాగునీటి పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ ప్రజలకు మాత్రం తాగు నీటిగండం తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వాగులో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన చెలమలు

తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నాం..



కొన్ని రోజులుగా తాగు నీటి కోసం చాలా తిప్పలు పడుతున్నాం. ఉదయం లేచినప్పటి నుంచి నీటి కోసం పెద్ద యుద్ధమే చేయాల్సి వస్తోంది. గ్రామంలో ఉన్న కొన్ని బోర్లలో నీరు రాకపోవడంతో ఉన్న బోరు ద్వారా ఊరందరికీ నీటి సరఫరా చేయడం ఇబ్బందిగా మారింది. అధికారులు చర్యలు తీసుకొని నీటి కష్టాన్ని తీర్చాలి.

– రామచంద్రుడు, వల్లూరు

నీటి సరఫరా సక్రమంగా లేదు..



గ్రామంలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదు. ప్రతిరోజు సక్రమంగా నీటిని విడువక పోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. నల్లా ద్వారా కేవలం రెండు బిందెలు రాగానే నల్లాలు బంద్ అవుతున్నాయి. దీంతో చేసేది ఏమీ లేక వాగులో తవ్విన శలిమను ఆశ్రయిస్తున్నాం. కానీ శలిమ నీరు ఉప్పుగా ఉండటంతో తాగేందుకు పనిచేయడం లేదు. అధికారులు స్పందించి గ్రామంలో తాగు నీటి సమస్యలు లేకుండా చూడాలి.

– భాస్కర్, వల్లూరు

ముందస్తు చర్యలు చేపడుతున్నాం..



మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని గుర్తించాం. ఆయా గ్రామాల్లో ముందస్తు చర్యల కోసం ప్రత్యేక ప్రణాళిక ద్వారా తాగునీటి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నాం. అక్కడక్కడ పాత బోర్లను రిపేర్ చేయించడంతో పాటు మిషన్ భగీరథ పైప్‌లైన్ల లీకేజీలకు మరమ్మతులు చేయిస్తున్నాం. ఎక్కడైనా తాగునీటి సమస్య ఎక్కువగా ఉంటే నీటి ట్యాంకుల ద్వారా సరఫరా చేసి నీటి ఎద్దడి లేకుండా చూస్తాం.

– భాస్కర్, ఎంపీఓ, ఇటిక్యాల

బస్టాండ్‌లో తాగునీటి సదుపాయం



అయిజ: మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ మంజులరెడ్డి కోరారు. 10 రోజుల క్రితం దాత ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఆర్‌ఓ ప్లాంట్ నిర్మాణం చేపట్టారు. శనివారం పనులు పూర్తి చేశారు. ప్రయాణికులు స్వచ్ఛమైన నీటిని తాగేందుకు అవకాశం కల్పించారు. అన్ని మండలాల్లోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు రావాలని డిపో మేనేజర్ కోరారు.

వృథాగా పారుతున్న నీరు



మానవపాడు: వేసవిలో గ్రామాలలో నీటి సమస్య రాకుండా ప్రభుత్వం గ్రామాలలో చర్యలు తీసుకుంటుంది. మండలంలోని జిల్లా అధికారుల ఆదేశానుసారం గ్రామాలలో పాత బోర్లు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. శనివారం మండల కేంద్రంలో బోర్ నుంచి వచ్చే నీరు వృథాగా పోతున్నా పట్టించుకునేవారు లేరు. నీళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం పక్కనే వృథాగా నీరు పారుతున్నా కొళాయికి ఇంత వరకు నల్లా ఏర్పాటు చేయలేదు. మండల అధికారుల పర్యవేక్షణ తూతూ మంత్రంగా తయారైందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఓఆర్ఎస్ పాకెట్ల అందజేత

ధరూరు: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు మండలంలోని ఓబులోనిపల్లిలో శనివారం సీనియర్ మేటి సురేష్ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. సందర్భంగా ఆయన కూలీలకు ఎండల తీవ్రతపై పలు సూచనలు సలహాలు చేశారు.

కూలి ఇవ్వకుండా కక్ష సాధింపు

అలంపూర్: ఉపాధి హామి కూలీలకు డబ్బులు ఇవ్వకుండా ప్రభుత్వం కక్ష కట్టిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దేవదాస్ అన్నారు. మండలంలోని లింగనవాయిలో ఉపాధి హామీ కూలీలతో శనివారం సమావేశం నిర్వహించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాలుగు వారాలుగా పని చేసిన డబ్బులు రాలేదని కూలీలు ఆయన దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ పేరుతో ప్రభుత్వం కష్ట జీవులకు కూలి ఇవ్వడం లేదన్నారు. ఎండలకు పని చేస్తున్న కూలీలపై కొలత పేరుతో ఒత్తిడి తీసుకొస్తుందని విమర్శించారు. కొలతలతో సంబంధం లేకుండా పనులు చేయించి తక్షణమే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.
ఉపాధి కూలీలకు పనిముట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ కమిటీని 14 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా గోవర్ధన్, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ అలీ, కార్యదర్శిగా రామకృష్ణ, సభ్యులుగా పలువురు ఉన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న దేవదాస్

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

మానవపాడు: మండలంలోని వేసవి నేపథ్యంలో శనివారం మండల కేంద్రంలోని చంద్రశేఖర్‌నగర్‌లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో 25కు పైగా టీంలు పాల్గొన్నాయి. గెలుపొందిన జట్లు క్వార్టర్ ఫైనల్స్‌లో తలపడుతాయని నిర్వాహకులు సూరి, సుబ్బారావు, బీమరాజ్, యుగేందర్ తెలిపారు.
శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జూలెకల్‌లో నిర్వహిస్తున్న జూలెకల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఉల్లాసంగా కొనసాగుతున్నాయి. సీజన్–4 టోర్నమెంట్ పోటీలను తిలకించడానికి గ్రామప్రజలు, యువకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

జూరాల నీటిని ఎందుకు తరలించారు?

గద్వాల అర్బన్: సాగు, తాగు నీరు గురించి మాట్లాడే ముందు జూరాలలో రెండు టీఎంసీల నీటిని ఎందుకు తరలించారో బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు జలదీక్ష చేపడితే ఉన్న జలాలు కూడా ఆవిరైపోయేలా ఉందని విమర్శించారు. జలదీక్షలో పాల్గొనేందుకు సిద్ధమైన ఎమ్మెల్యే అసలు ఈ కరువుకు కారణంగా ఎవరో తెలిసే మాట్లాడుతున్నారా అని నిలదీశారు. నీటి ఎద్దడిని గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తుగా జిల్లాకు రూ.1.89కోట్లు మంజూరు చేసిందని, చిత్తశుద్ధితో పనులు ప్రారంభానికి చర్యలు మొదలు పెట్టారని తెలిపారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు ఇసాక్, వెంకట్రామిరెడ్డి, భాస్కర్ యాదవ్, తుమ్మల నర్సింహులు, డీటీడీసీ నర్సింహులు, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఉపాధి కూలీలకు టెంట్‌లు ఏర్పాటు

ఎండలు తీవ్రం కావడంతో ఉపాధి కూలీలకు వడదెబ్బ సోకే అవకాశం ఉండడంతో పని చేసే చోట్ల టెంట్లు ఏర్పాటుచేశారు. వడ్డేపల్లి మండలంలోని జూలెకల్‌లో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు పనిచేసే చోట శనివారం టెంట్లు ఇచ్చారు. పనిచేసే సమయంలో ఎండలు తీవ్రంగా ఉన్నాయని, టెంట్ల ఏర్పాటుతో ఉపశమనం లభిస్తోందని కూలీలు ఆనందం వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనుల వద్ద అధికారులు టెంట్లు ఏర్పాటు చేయాలని కూలీలు కోరుతున్నారు.

– శాంతినగర్



టెంట్ కింద సేద తీర్చుకుంటున్న ఉపాధి కూలీలు

శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు శనివారం ప్రారంభించారు. శ్రీరామనవమికి అర్చకులతో 18వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. 17న శ్రీరామనవమి సందర్భంగా కల్యాణం నిర్వహిస్తారని, 18న కొత్త రథం ప్రారంభోత్సవం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి తెలిపారు.

18న జిల్లా స్థాయి గిరకబండ్ల పోటీలు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బట్లదిన్నెలో శ్రీరామనవమిని పురస్కరించుకుని ఈ నెల 18న జిల్లా స్థాయి ఎద్దుల గిరక బండ్ల పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన టీంలకు మొదటి బహుమతిగా రూ.20,016, రెండవ బహుమతిగా రూ.15,016, మూడవ బహుమతిగా రూ.10,016, నాల్గవ బహుమతిగా రూ. 5,016 ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచినవారు తమ పేరును నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9542809392, 9346155083 సంప్రదించాలని వారు కోరారు.

ఆర్థికసాయం అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని కొండేరు చెందిన బోయ ఈదమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు శనివారం మృతురాలి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ట్రస్టు ఆధ్వర్యంలో రూ. 5వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో భాస్కర్, వెంకటేష్, ఇంజనేయుడు, విశ్వనాథం, బీచుపల్లి తదితరులు ఉన్నారు.

పాఠశాలలో బ్యాటరీలు చోరీ

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని కొంకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బ్యాటరీలు చోరీకి గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. రెండు రోజులుగా రంజాన్ సెలవులు ఉండటంతో పాఠశాలను మూసివేశారు. ఇదే అదునుగా భావించి కంప్యూటర్ గదిలో ఉన్న ఆరు బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. తులుపులు పగలగొట్టబడిగున్న విషయాన్ని గమనించిన గ్రామస్తులు ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. ఈ విషయమై శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

నాలుగేళ్లు దాటినా..



కంకర వేసి వదిలేసిన చింతల్ క్యాంపు రోడ్డు

- రాజోళిలో పలు రోడ్లకు దక్కని మోక్షం
- 2019లో పనులకు భూమి పూజ
- నేటి వరకు పూర్తికాని వైనం

రాజోళి: మండలంలో బీటీ రోడ్లకు పూర్తిస్థాయిలో మోక్షం దక్కడం లేదు. ఎన్నో ఏళ్లకు తమ గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరయ్యాయని ప్రజలు సంతోషించినప్పటికీ.. ఆ సంతోషం ఎక్కువ రోజులు ఉండలేదు. కేవలం భూమి పూజ చేసి వదిలేశారే.. తప్ప ఇంత వరకు పనులు పూర్తి కాలేదు. దీంతో ప్రజలు తమ గ్రామాలు అభివృద్ధి చెందేందుకు ఇంకెన్నాళ్లు పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఒక గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా ఉండాల్సింది రోడ్డు సౌకర్యం. అదే లేకపోతే గ్రామంలో రవాణా సక్రమంగా ఉండక, రాకపోకలు కాక అభివృద్ధి చెందటం కష్టతరంగా మారుతుంది. ప్రస్తుతం మండలంలో చాలా గ్రామాల పరిస్థితి అలాగే తయారైంది.

2019లో భూమిపూజ..

మండలంలోని పలు గ్రామాలకు బీటీ రోడ్లు వేసేందుకు రూ.కోట్లు కేటాయించారు. వీటికి 2019లో అప్పటి ఎమ్మెల్యే అబ్రహం భూమి పూజ చేసి, శిలాఫలకాలను ఏర్పాటు చేశారు. నేటి వరకు పూర్తిస్థాయిలో రోడ్ల పనులు పూర్తి కాలేదు. 2019 కంటే ముందే పలు గ్రామాలకు బీటీ రోడ్లు లేకపోవడం, వేసినవి కూడా ఏళ్లు గడిచిపోవడంతో పూర్తి గుంతలమయంగా మారి ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. 2019 ఫిబ్రవరి నెలలో వీటికి మళ్లీ భూమి పూజ చేయడంలో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అందులో భాగంగా పెద్ద తాండ్రపాడు నుంచి చింతల్ క్యాంపును కలుపుతూ, ఆర్డీఎస్ కెనాల్ మీదుగా తనగల వరకు రోడ్డు వేసేందుకు రూ.2.75కోట్ల నిధులను కేటాయించగా, కొన్నేళ్ల పాటు పనులు అసలు ప్రారంభించలేదు. ఈ మధ్య కాలంలో కొద్ది మేర కంకర వేసి వదిలేశారు. తుమ్మిళ్ల నుంచి పడమటి గార్లపాడు మీదుగా మండల కేంద్రంకు రోడ్డు వేసేందుకు రూ.2.60 కోట్లు కేటాయించగా పనులు పూర్తయినప్పటికి అక్కడక్కడా పెండింగ్‌లో ఉంది. మాన్‌దొడ్డి నుంచి తుమ్మిళ్లకు రూ.2.42కోట్లతో బీటీ రోడ్డు వేసేందుకు కేటాయించగా, ఇంత వరకు దానికి సంబంధించిన పనులే ప్రారంభం కాలేదు. ఈ రోడ్లను వేస్తే దాదాపుగా మండలంలోని అన్ని గ్రామాలను కలుపుతూ వాహనాల రాకపోకలకు వీలవుతుందని భావించారు. ఇంతవరకు ఆ పనులే ప్రారంభం కాకపోవడంతో ఆ గుంతల రోడ్లపైనే వాహనాలు తిరుగున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే ద్విచక్రవాహనం కూడా ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంటుంది. రోడ్డు పనులు పూర్తి చేసేందుకు నెలల సమయం తీసుకోవాల్సింది పోయి, ఏళ్లు గడుస్తున్నా పూర్తి చేయకపోవడం, దానిపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కూడా స్పందించకపోవడంతో మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంకటాపురం స్టేజీ నుంచి మాన్‌దొడ్డికి వెళ్లే ప్రధాన రోడ్డు కూడా దారుణంగా ఉంటే, మారుమూల గ్రామాల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో శిలాఫలకాలు వేసి వదిలేశారని, ప్రభుత్వం మారిందనే సాకుతో ఇంకెన్నాళ్లు పనులు నిలిపేస్తారోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

గాయాలపాలవుతున్నాం..



2019లో రోడ్డు వేస్తున్నామని చెప్పి భూమి పూజ చేశారు. ఇంత వరకు పనులు పూర్తి కాలేదు. చాలా రోజుల తర్వాత కంకర వేసి వదిలేశారు. ఆ కంకర వల్ల ద్విచక్రవాహనాలు జారీ కిందపడుతున్నాం. చాలా మంది గాయాలపాలై ఆ రోడ్డు వెంట వెళ్లాలంటే భయపడుతున్నాం. పొలాలలకు వెళ్లాంటే చాలా నరకప్రాయంగా ఉంది. అధికారులు అసలు పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు రోడ్ల విషయాన్ని మరిచిపోయారు.

– మల్లికార్జున్, పెద్ద తాండ్రపాడు

గ్రామాలను కలుపుతుందనుకుంటే..



రోడ్లకు భూమి పూజ చేస్తే పలు గ్రామాలను కలుపుతుందని సంతోషించాం. నేటి వరకు పనులే పూర్తి కాలేదు. వెంకటాపురం నుంచి ప్రధాన రోడ్డు గుంతలమయం అయ్యింది. చింతల్‌క్యాంపు నుంచి ఆర్డీఎస్ మీదుగా వేస్తారనుకున్న రోడ్డు ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకు పూర్తి కాలేదు. ఇలా అయితే రాకపోకలతకు చాలా ఇబ్బందిగా ఉంటుంది.

– సుధాకర్‌గౌడ్, తనగల

మీటింగ్‌లో చర్చిస్తాం

మండలంలో ఆయా గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్ల పనులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. కాంట్రాక్టర్లు పనులు ఆలస్యం చేసేందుకు పలు కారణాలున్నాయి. ఎన్నికల కోడ్‌లు కూడా పనుల జాప్యానికి కారణం. ఉన్నతాధికారులతో జరిగే రివ్యూ మీటింగ్‌లో విషయాన్ని చర్చించి, వీలైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా చూస్తాం.

– ఆంజనేయులు, పీఆర్ డీఈ